
అంబులెన్స్‌లోకి తరలిస్తూ..


అత్యవసరంగా తరలించడం ఇలా..

దేనికైనా.. రెడీ..!


సైరన్ మోతకు చెవులు మూసుకున్న చిన్నారులు


భవనంపై నుంచి రక్షించడం


పై అంతస్థులో చిక్కుకున్న వారిని రక్షించడం ఇలా..

- నగరంలో ఎన్‌డీఆర్‌ఎఫ్ ఆధ్వర్యంలో మాక్‌డ్రిల్
- అత్యవసర పరిస్థితిపై అవగాహన
- పలు ప్రాంతాల్లో మార్మోగిన సైరన్
- పాకిస్థాన్ వాసులపై ప్రత్యేక నిఘా
- ఎయిర్‌పోర్ట్‌ల వద్ద భారీ బందోబస్తు
- రాష్ట్రమంతటా ఆపరేషన్ సిందూర్ సంబరాలు

బెంగళూరు, మే 7(ఆంధ్రజ్యోతి): యుద్ధమే రానీ..ఏ కష్టమే రానీ మేము సిద్ధం అంటూ నగర ప్రజలు మాక్‌డ్రిల్‌లో పాల్గొన్నారు. బుధవారం నగరంలోని పలు ప్రాంతాల్లో మాక్‌డ్రిల్, సైరన్ మోతలతో ప్రజలకు అధికారులు అవగాహన కల్పించారు. పహల్గాం ఉగ్రదాడికి కేంద్ర రక్షణశాఖ ఆదేశాలతో సైన్యం దీటైన సమాధానం చెప్పింది. పాకిస్థాన్ నిద్రపోతున్న సమయంలో ప్రపంచమంతటా ఉలిక్కిపడేలా మెరుపుదాడులు జరిపి 9 ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేయడం ద్వారా పలువురు ఉగ్రవాదులను మట్టుపెట్టడం ద్వారా ఆపరేషన్ సిందూర్ విజయవంతమైంది. దేశవ్యాప్తంగా యుద్ధ వాతావరణంపై ప్రజలను చైతన్యం చేసేందుకు ముందుగానే మాక్‌డ్రిల్‌ను నిర్వహించదలిచారు. అంతకంటే ముందుగానే ఆపరేషన్ సిందూర్ విజయవంతంతో దేశప్రజలంతా సంతోషంగా గడిపే సందర్భం ఏర్పడింది. బుధవారం సాయంత్రం అగ్నిమాపక, అత్యవసర విభాగాలు ఎన్‌డీఆర్‌ఎఫ్ బలగాలు మాక్‌డ్రిల్ నిర్వహించాయి. బెంగళూరు నగర వ్యాప్తంగా 32చోట్ల ఏకకాలంలో సైరన్ మోగించారు. ప్రధాన కూడళ్లు, పోలీస్ స్టేషన్‌లు, అగ్నిమాపక కేంద్రాలలో సైరన్ మోగింది. సైరన్ ద్వారా ప్రజలు అవగాహన పొందాలనేలా ఏర్పాటు చేశారు. సైరన్ మోత సుమారు 3 కిలోమీటర్ల వరకు వినిపిస్తుంది. అత్యవసర పరిస్థితులు ఏర్పడితే ఎలా రక్షించుకోవాలనే అవగాహన కల్పించారు.


వీక్షిస్తున్న హోం మంత్రి పరమేశ్వర్, డీజీపీ అలోక్‌మోహన్

హలసూరు చెరువులో..


నీటి నుంచి రక్షించే చర్యలు ఇలా...

హలసూరు చెరువు వద్ద జరిగిన మాక్‌డ్రిల్‌లో ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్, సివిల్ డిఫెన్స్, హోంగార్డ్స్ సీఆర్‌పీఎఫ్, సివిల్ పోలీసులు, ఎన్‌సీసీ, ఎన్‌వైకే సభ్యులు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. అత్యవసరంగా నీటిలో ఇరుక్కుంటే వారిని బోట్ల ద్వారా రక్షించే విధానం, రెండు, మూడు అంతస్తులలో అత్యవసర పరిస్థితి ఏర్పడితే వారిని నిచ్చెనద్వారా కిందకు తీసుకురావడం, ఆరేడు అంతస్థుల్లో అగ్నిప్రమాదం వంటి సంఘటనలు చోటు చేసుకుంటే వారిని రక్షించడం, మంటలను ఆర్పే విధానాలను ప్రదర్శించారు. రాయచూరు రైల్వేస్టేషన్‌లో రైల్వే, సివిల్‌డిఫెన్స్ విభాగం చైతన్యం కలిగించింది. మాక్‌డ్రిల్ సందర్భంగా హోం మంత్రి పరమేశ్వర్ మీడియాతో మాట్లాడుతూ కేంద్ర రక్షణ, హోం మంత్రిత్వశాఖల సూచన మేరకు మాక్‌డ్రిల్‌ను ఏర్పాటు చేశామన్నారు. సైరన్‌ను బట్టి ఏ విధంగా వ్యవహరించాలనేది ప్రయోగాత్మకంగా చూపారు.


సైరన్ మోగించాక చెవులు మూసుకునే తీరు..

పాకిస్థాన్ వాసులపై ప్రత్యేక నిఘా

రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్న పాకిస్థాన్ వాసులపై నిఘా పెట్టారు. ఉత్తరకన్నడ జిల్లా భత్కళ్‌లో 15మంది, మైసూరులో ముగ్గురు చిన్నారులతోపాటు తల్లి, బెంగళూరులో ఓ టెకీ కుటుంబంతోపాటు 90మంది దాకా పాకిస్థాన్ వాసులు రాష్ట్రంలో ఉన్నారు. వారిపై నిఘా ఉంచారు.

ఎయిర్‌పోర్ట్‌ల వద్ద పటిష్ట బందోబస్తు

రాష్ట్రంలోని అంతర్జాతీయ విమానాశ్రయాలు బెంగళూరు కెంపేగౌడ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్, మంగళూరులోని బజ్పె ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌ల వద్ద భద్రత పటిష్టం చేశారు. బెంగళూరు నుంచి జమ్ము, కశ్మీర్‌తోపాటు ఐదు ప్రాంతాలకు విమాన సర్వీసులు అత్యవసరంగా రద్దు చేసినట్లు ఎయిర్‌పోర్ట్ అథారిటీ ప్రకటించింది. తదుపరి ప్రయాణాలు చేయదలచుకుంటే ముందుగా సమాచారం తెలుసుకోవాలని ఆదేశించారు. ప్రధానంగా బెంగళూరులోని ఇస్రో, డీఆర్‌డీఓ, ఎయిర్‌బేస్, వివిధ విభాగాలు, మిలిటరీ క్యాంప్‌ల ప్రాంతాలను అప్రమత్తం చేశారు. బెళగావి, కలబురగి క్యాంప్‌లలోనూ అప్రమత్తం కొనసాగింది. కారవార, మంగళూరులలో నావికాదళం బందోబస్తును పెంచింది.


విశ్వేశ్వరయ్య టవర్స్‌పై సైరన్ ..



రాష్ట్రమంతటా ఆపరేషన్ సింధూర్ సంబరాలు

మంగళవారం రాత్రి పొద్దుపోయాక పాకిస్థాన్‌పై మెరుపుదాడి విజయవంతం కావడంతో రాష్ట్రమంతటా ఆపరేషన్ సింధూర సంబరాలు చేసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఆలయాల్లోనూ విశేష పూజలు నిర్వహించారు. బుధవారం ఉదయం 7 గంటలనుంచే బెంగళూరుతోపాటు వివిధ ప్రాంతాలలో జాతీయ పతాకాలతో సంబరాలు చేసుకున్నారు.

ఇది మన సైనికుల పరాక్రమం: మంత్రి జమీర్



బళ్లారి సిటీ, మే 7(ఆంధ్రజ్యోతి): పహల్గాంలో అమాయకుల ప్రాణాలను బలిగొన్న పాకిస్తాన్ ఉగ్రవాదుల చర్యకు ప్రతీకారంగా 'ఆపరేషన్ సిందూర్' నిర్వహించడం ద్వారా భారత సైన్యం తన బలాన్ని, పరాక్రమాన్ని ప్రదర్శించిందని గృహనిర్మాణ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి జమీర్ అహమ్మద్ ఖాన్ అన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... భారత సైన్యం కృషి ప్రశంసనీయమన్నారు. ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పిస్తున్న పాకిస్తాన్‌కు తగిన గుణపాఠం మన సైన్యం చెప్పిందన్నారు. మనం వారికి సహాయం చేస్తే ఉగ్రవాదులు, పాకిస్తాన్ మనుగడ సాగించలేరనే సందేశం పంపబడింది. 'మాసైన్యం మా గర్వం' అని అన్నారు. భారత దేశంలో అశాంతిని సృష్టించే, ఉగ్రవాద చర్యలకు పాల్పడే తీవ్రవాద సంస్థల నాశనానికి కేంద్ర ప్రభుత్వం చేస్తున్న పోరాటంలో మనమందరం బాగస్వాములము కావాలన్నారు.


విల్సన్‌గార్డెన్‌లో జాతీయ పతాకంతో సంబరం

పాక్‌కు దీటైన జవాబు : ఎమ్మెల్యే

మహదేవపుర, మే 7 (ఆంధ్రజ్యోతి): పహల్గాంలో అమాయక పర్యాటకులను బలిగొన్న ఉగ్రవాదుల చర్యలను తిప్పికొట్టేలా భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతం చేసిందని ఎమ్మెల్యే మంజుళా లింబావళి అన్నారు. పాకిస్థాన్‌కు దీటైన జవాబు ఇచ్చారని ఆమె అన్నారు. పహల్గాంలో అమాయకుల నరమేధం అందరినీ కలచివేసిందని, ఆపరేషన్ సిందూర్ ద్వారా మన ఇండియన్ ఆర్మీ పాక్ ఉగ్రవాదులకు గట్టిబుద్ధి చెప్పిందన్నారు.

ప్రముఖ కవి జీఎస్ సిద్దలింగయ్య కన్నుమూత

- సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్ సంతాపం
- ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు


సిద్దలింగయ్య (ఫైల్)

బెంగళూరు, మే 7(ఆంధ్రజ్యోతి): ప్రముఖ కన్నడ కవి, విద్యానిపుణుడు, కన్నడ సాహిత్య పరిషత్ మాజీ అధ్యక్షుడు ప్రొఫెసర్ జీఎస్ సిద్దలింగయ్య (94) కన్నుమూశారు. వయోభారం సమస్యలతో బాధపడుతున్న ఆయనను విజయనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స ఫలించక బుధవారం తుదిశ్వాస వీడారు. తుమకూరు జిల్లా బెళ్ళావి నివాసి అయిన సిద్దలింగయ్య కన్నడ సంస్కృతిశాఖ, విద్యా, సాహిత్యరంగాలకు ఆయన ఎనలేని సేవలందించారు. కన్నడ సాహిత్య పరిషత్ 17వ అధ్యక్షుడిగా వ్యవహరించారు. కవి, విమర్శకులు, అనువాదకులుగా కన్నడ పుస్తకలోకానికి వన్నె తెచ్చారు. రాజ్యోత్సవ పురస్కారంతోపాటు పలు అవార్డులు పొందారు. చిత్రదుర్గ కళాశాలలో కన్నడ అధ్యాపకుడిగా సేవలు ప్రారంభించి వివిధ కళాశాలల ప్రిన్సిపాల్‌గా కళాశాల విద్యావిభాగానికి డైరెక్టర్‌గా సేవలందించారు. సీఎం సిద్దరామయ్య, బీజేపీ అధ్యక్షుడు విజయేంద్ర, కన్నడ సంస్కృతిశాఖ మంత్రి శివరాజ్ తంగడగి తదితరులు సంతాపం తెలిపారు.

కేంద్రమంత్రి సోమణ్ణ, విజయనగర్ ఎమ్మెల్యే కృష్ణప్ప, సాహితీవేత్త ఎస్‌జి సిద్దలింగయ్య, నిడుమామిడి మఠాధిపతి వీరభద్ర చన్నమల్లస్వామిజీ, బేలిమఠాధిపతి శివరుద్రస్వామిజీ, కన్నడ సాహిత్య పరిషత్ అధ్యక్షులు మహేశ్‌జోషి, మాజీ అధ్యక్షులు హంప నాగరాజయ్య, గో.రు.చన్నబసప్ప, మను బలిగార్ తదితరులు పార్థివదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. సాహితీవేత్తలు బీఎస్ పరమశివయ్య, అగ్రహార కృష్ణమూర్తి, లక్ష్మీనారాయణ, డాక్టర్ ఆశాదేవి, సిద్దగంగా విద్యాసంస్థ ఈడీ జయవిభవస్వామి, కన్నడ సంస్కృతిశాఖ జాయింట్ డైరెక్టర్ బలవంతరావ్ పాటిల్, కన్నడ సంఘాల ఐక్యకూటమి నేత వాటాళ్ నాగరాజ్‌తోపాటు పలువురు సంతాపం తెలిపారు. చామరాజపేటలోని లింగాయత స్మశానవాటికలో కన్నడ అధ్యాపకుడు రుద్రేశ్ అదరంగి, వచనజ్యోతి బళగ అధ్యక్షుడు పినాకపాణి, నాటక అకాడమీ అధ్యక్షుడు నాగరాజ్ మూర్తి అంతిమ కార్యాలు జరిపించారు. ఆయన అంత్యక్రియలు అధికార లాంఛనాలతో ముగించారు.

కసాప అధ్యక్షుడికి భద్రత కల్పించండి

- హైకోర్టు ఆదేశం


మహేశ్ జోషి

బెంగళూరు, మే7(ఆంధ్రజ్యోతి): కన్నడ సాహిత్య పరిషత్ (కసాప) రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్‌జోషి ప్రాణాలు తీస్తామనే హెచ్చరికల నేపథ్యంలో పోలీసులు రక్షణ కల్పించాలని హైకోర్టు ఆదేశించింది. మహేశ్‌జోషి దాఖలు చేసుకున్న పిటిషన్‌పై విచారించిన న్యాయమూర్తి జస్టిస్ ఎం నాగప్రసన్న ధర్మాసనం బుధవారం ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్రంలోని నిరిష్టమైన స్థలాల్లో మహేశ్‌జోషికి భద్రత కల్పించాలన్నారు. ఇటీవల మండ్యలో జరిగిన అఖిలభారత కన్నడ సాహిత్య సమ్మేళనం తర్వాత ఆయనకు బెదిరింపులు రావడంతో ఆయన కోర్టును ఆశ్రయించారు. అందుకు అనుగుణంగానే ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది.


బాగేపల్లిలో అమ్మవారికి అలంకరణ

వాసవాంబకు వందనం..!

- వాసవీ జయంతి సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు


లోకాయుక్త తనిఖీలు


బళ్లారిరూరల్, మే 7 (ఆంధ్రజ్యోతి) : బళ్లారి నగరంలోని మహానగరపాలిక జోన్3 కార్యాలయంలో బుధవారం లోకాయుక్త అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా బీ ఖాతా రన్నింగ్ ఫైల్స్‌పై లోకాయుక్త ఎస్పీ సిద్దరాజు నేతృత్వంలో పరిశీలించారు. పలు భూముల వ్యవహారలపై అధికారులతో ఆరా తీశారు. కార్యాలయం చేరుకున్న అధికారులు పలు ఫైల్స్‌ను పరిశీలించారు. బీ ఫైల్స్‌కి సంబంధించి 10-15 రోజుల్లో ప్రజలకు ఇబ్బందులు కాకుండా పెండింగ్ వుండకుండా ఫైల్స్‌ను సరిచేయాలని అధికారులకు సూచించారు. రైతులను కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దని, తక్షణమే అవసరమైన పత్రాలు జారీ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ ఇన్స్‌పెక్టర్ సురేష్, నాగిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న లోకాయుక్త అధికారి



గోడౌన్‌లో కొత్తపుస్తకాలను పరిశీలిస్తున్న డీఈఓ ప్రసాద్‌బాబు, మేనేజర్ పావని





1, 2 క్లాసులకు మూడు సబ్జెక్టులు ఒకే పుస్తకంగా కలిపి ముద్రించిన కొత్త బుక్



మారిన పదో తరగతి కొత్త సిలబస్ హిందీ పుస్తకం



9వ తరగతిలో సోషల్ అన్ని విభాగాలూ కలిపి ఒకే పుస్తకంగా..

బడి బ్యాగు..

ఇక.. తేలికే..!

పిల్లలపై భారం తగ్గించేలా విద్యాశాఖ నిర్ణయం

- కొన్ని సబ్జెక్టులు కలిపి ఒకే పుస్తకంలో ముద్రణ
- 1, 2 తరగతులకు ఒకే బుక్‌లో మూడు సబ్జెక్టులు
- మారిన 9, 10 క్లాసుల హిందీ సిలబస్
- ఉమ్మడి జిల్లాకు 15.91 లక్షల పాఠ్యపుస్తకాల ఇండెంట్
- జిల్లాకు చేరిన 14.86 లక్షల పుస్తకాలు
- మండల కేంద్రాలకు 9.44 లక్షలు సరఫరా
- స్కూళ్ల ప్రారంభానికి ముందే బుక్స్: డీఈఓ ప్రసాద్‌బాబు

అనంతపురం విద్య, మే 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు తీపికబురు. బడి పిల్లలకు పుస్తకాల మొత తగ్గనుంది. బడి బ్యాగు తేలిక కానుంది. ఆ మేరకు కొత్త పాఠ్యపుస్తకాలు వచ్చేశాయ్. వస్తూ వస్తూ... కొత్త బుక్స్ న్యూలుక్‌తో ఎంట్రీ ఇస్తున్నాయి. బడి పిల్లలపై ఇక బ్యాగులు, పుస్తకాల బరువు ఉండబోదు. 'అయ్యో.. బుడ్డోడా.. ఇన్ని పుస్తకాలు ఎలా మోస్తాడబ్బా.' అంటూ తల్లిదండ్రుల మనసు చిబుకుమనేది. పేరెంట్స్ ఇకపై అలా చింతించాల్సిన పని ఉండదు. బడి పిల్లలపై పుస్తకాలు, బ్యాగుల బరువు తగ్గించాలన్న రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఆ మేరకు కొన్ని సబ్జెక్టులకు ఒకే పుస్తకాన్ని రూపొందించారు. గత పాలకులు ఒక పుస్తకాన్ని రెండు, మూడు సెమిస్టర్లుగా విభజించి, భారీగా ముద్రించి కోట్ల రూపాయలు దోచేశారు. కొత్త ప్రభుత్వం పిల్లలపై భారం ఉండరాదంటూ.. ఒకే పుస్తకంలో రెండు, మూడు సబ్జెక్టులు ముద్రించి, అదనపు భారాన్ని తగ్గించారు. 1 నుంచి పదో తరగతి వరకూ చూసినా... 6 సబ్జెక్టుల పుస్తకాల కంటే ఎక్కువ రావు. గతంలో 14 పుస్తకాలు ఇచ్చిన దాఖలాలున్నాయి. ఈ ఏడాది కొత్త పుస్తకాలు తక్కువ సైజ్‌తో.. ఎక్కువ సౌలభ్యంతో అందించనున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాకు 15.91 లక్షల పాఠ్యపుస్తకాల ఇండెంట్ పంపగా.. ఇప్పటికే 14.86 లక్షలు వచ్చాయి. 51 మండలాలకు 9.44 లక్షల పుస్తకాలను ఇప్పటికే సరఫరా చేశారు.



15.91 లక్షల ఇండెంట్...

అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలకు ఉమ్మడిగా సెమిస్టర్-1 పుస్తకాలు 15.91 లక్షలు కావాలని ప్రింటర్లకు ఇండెంట్ పెట్టారు. జిల్లాలోని గోడౌన్లకు ఇప్పటికే 14.86 లక్షల పుస్తకాలను పంపారు. వాటిని ఆర్టీసీ బస్సుల ద్వారా మండలాలకు సరఫరా చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని 63 మండలాలకుగాను 51 మండలాలకు 9.44 లక్షల పాఠ్యపుస్తకాలను ఇప్పటికే సరఫరా చేశారు. మండలాలకు చేరిన పుస్తకాలను స్కూళ్లకు మండల విద్యాశాఖాధికారులు సరఫరా చేయనున్నారు. మండల పాయింట్ నుంచి స్కూళ్లకు రవాణా చేసేందుకు అయ్యే వ్యయంపై అటు జిల్లా విద్యాశాఖ, ఇటు సమగ్రశిక్ష అధికారులు క్లారిటీ ఇవ్వడం లేదు.

బరువు తగ్గిన బడి పుస్తకం



ప్రభుత్వ బడిపిల్లల పాఠ్యపుస్తకాలు బరువు తగ్గాయి. ఇది అటు విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు శుభవార్త అనే చెప్పాలి. రెండు, మూడు సబ్జెక్టులను కలిపి ఒకే పుస్తకంలో ఉండేలా రూపొందించారు. గతంలో కొన్ని క్లాసులకు 10 నుంచి 14 పుస్తకాలను సైతం అందించారు. దీంతో విద్యార్థులు ఆ బరువు మోయలేక ఇబ్బందులు పడ్డారు. ఈ ఏడాది వచ్చిన కొత్త పుస్తకాల్లో చాలా క్లాసులకు రెండు, మూడు సబ్జెక్టులను ఒక పుస్తకంగానూ, ఒక సబ్జెక్టుకు ఒక పుస్తకం తీసుకురావంతో ఆ బరువు తగ్గనుంది. ఈ ఏడాది వచ్చే కొత్త పుస్తకాల్లో 9, 10 తరగతుల హిందీ పుస్తకాలు సిలబస్ మారనున్నాయి. 1, 2 క్లాసులకు సంబంధించి తెలుగు, గణితం, ఇంగ్లిష్ (ఒక పుస్తకంగా), 3, 4, 5 తరగతులకు తెలుగు, ఇంగ్లిష్ (ఒక పుస్తకంగా), గణితం, ఈవీఎస్ (ఒక పుస్తకంగా), 6, 7 తరగతులకు తెలుగు, హిందీ, ఇంగ్లిష్ (ఒక పుస్తకంగా), సోషల్, గణితం, సైన్స్ (విడివిడిగా), 8వ క్లాస్‌కు తెలుగు, హిందీ, ఇంగ్లిష్ (ఒకటిగా), ఫిజిక్స్, బయాలజీ (ఒకటిగా), సోషల్, గణితం (విడివిడిగా), 9వ క్లాస్‌కు తెలుగు, హిందీ, ఇంగ్లిష్ (ఒకటిగా), ఫిజిక్స్, బయాలజీ(ఒకటిగా), గణితం, సోషల్ (విడివిడిగా), 10వ క్లాస్‌కు అన్ని సబ్జెక్టులు, వర్క్‌బుక్స్ కలిపి సుమారు 12 అందించనున్నారు.

51 మండలాలకు చేరాయి



కొత్త పాఠ్యపుస్తకాలను ప్రభుత్వం వేగంగా సరఫరా చేస్తోంది. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలకు కలిపి 15.91 లక్షల పాఠ్యపుస్తకాలు రావాల్సి ఉండగా.. ఇప్పటి వరకూ 14.86 లక్షలు చేరాయి. 51 మండలాలకు సరఫరా ప్రారంభమైంది. 90 శాతం పుస్తకాలు జిల్లాకు చేరాయి. పాఠ్యపుస్తకాలతోపాటు ఇతర స్టూడెంట్ కిట్లు సైతం వస్తున్నాయి. స్కూళ్ల రీ ఓపెన్‌కు ముందే విద్యార్థులకు అన్నీ అందుబాటులో ఉంచుతాం.

- ప్రసాద్‌బాబు, డీఈఓ, అనంతపురం

విద్యుత్ బిల్లు చెల్లింపు

ఇక సులభతరం..!

- క్యూఆర్ కోడ్ ద్వారా చెల్లింపులు..
- బిల్లులోనే క్యూఆర్ కోడ్‌ను రూపొందించిన విద్యుత్ సంస్థ



అనంతపురంరూరల్, మే 7(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం సాంకేతిక పరిజ్ఞానం పెరిగిపోయింది. ఈ సాంకేతిక విధానాన్ని వినియోగించుకోవడంలో విద్యుత్ సంస్థ ముందు వరసలో ఉంటోంది. ఈ క్రమంలోనే వినియోగదారులకు విద్యుత్ సేవలను మరింత చేరువ చేసేలా చర్యలు చేపట్టింది. విద్యుత్ బిల్లుల చెల్లింపు ప్రక్రియను మరింత సులభతరం చేస్తూ అడుగులు వేసింది. క్యూఆర్ కోడ్ ద్వారా బిల్లు చెల్లింపు ప్రక్రియను వినియోగదారులకు అందుబాటులోకి తీసుకువచ్చింది. వినియోగదారులకు చెల్లించే బిల్లులోనే ఈ క్యూఆర్ కోడ్‌ను రూపొందించింది. ఈ నెల జారీ చేస్తున్న బిల్లుల నుంచి ఈ విధానాన్ని అమలులోకి తీసుకు వచ్చింది.

క్యూఆర్ కోడ్ ద్వారా..

కొన్నేళ్ల కిందట విద్యుత్ శాఖ సిబ్బంది ఇళ్ల వద్దకు వచ్చి బిల్లులు కట్టించుకునేవారు. ఆ తరువాత పెద్ద బుక్కులు తీసుకొచ్చి ఒక చోట కుర్చుని రాతపూర్వకంగా బిల్లులు కట్టించుకుని చిన్న పాటి స్లిప్‌లు వినియోగదారులకు ఇచ్చేవారు. అక్కడి నుంచి మిషన్ల ద్వారా బిల్లులు జారీకి ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి కట్టించుకునేవారు. ఇంతలోనే చెల్లింపు కేంద్రాలకు వెళ్లకుండా ఫోన్‌పే, గూగుల్ పే, యూపీఐ తదితరాల ద్వారా చెల్లింపులు ప్రారంభించారు. కొన్ని రోజుల కిందట ఫోన్ పే, గూగుల్ పే ద్వారా చెల్లింపులు నిలిచిపోవడంతో ఆన్‌లైన్‌లోనే సంస్థ వెబ్‌సైట్‌లో బిల్లులు చెల్లింపులు ప్రారంభించింది. ఈ ప్రక్రియతో మొదట్లో వినియోగదారుల కొంత ఇబ్బంది పడ్డారు. ఈ విధానం ద్వారా చెల్లించలేనివారు కార్యాలయాలకు వచ్చి చెల్లిస్తున్నారు. తాజాగా క్యూఆర్ కోడ్ ద్వారా చెల్లింపు ప్రక్రియను ప్రారంభించింది. ఈనెల జారీ చేస్తున్న విద్యుత్ బిల్లులో ఈ విధానాన్ని తీసుకొచ్చింది. ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం ఇతరాత్రవాటి ద్వారా విద్యుత్ బిల్లుపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసిన వెంటనే సంబంధిత వినియోగదారుడి బిల్లులు చూపిస్తుంది. తద్వారా వినియోగదారుడు బిల్లు చెల్లించుకునే వీలు కల్పించారు.

ఆ సర్వీసులకు తప్ప..

జిల్లాలో 10.19 లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో గృహ కనెక్షన్లు 7.07 లక్షలు, వ్యవసాయ కనెక్షన్లు 2.06 లక్షలు, వాణిజ్యం, పరిశ్రమలు, ప్రభుత్వ కార్యాలయాలు, వీధిదీపాలు ఇతరాత్ర కనెక్షన్లు లక్షకు పైగా ఉన్నాయి. ఇందులో ప్రభుత్వ సర్వీసులకు సంబంధించి 25 వేల కనెక్షన్లు ఉన్నట్లు తెలుస్తోంది. కాగా ఈ నూతన విధానం ప్రభుత్వ సర్వీసులకు లేదని తెలుస్తోంది. అదేవిధంగా అరియర్స్, బిల్లు పెండింగ్‌లో ఉన్న వినియోగదారులకు ఈ వెసులుబాటు ఉండదని అధికారులు చెబుతున్నారు. గత నెల బిల్లు చెల్లించకపోయినా ఈ నెల బిల్లులో ఈ క్యూఆర్ కోడ్ కనిపించదని విద్యుత్ శాఖ అధికారులు అంటున్నారు.

సేవలను మరింత చేరువ చేసేందుకే..

విద్యుత్ సేవలను వినియోగదారులకు మరింత చేరువ చేసేందుకు క్యూఆర్ కోడ్ విధానాన్ని అందుబాటులోకి తీసుకు వచ్చాం. ప్రభుత్వ సర్వీసులకు మినహా..ప్రైవేట్ సర్వీసులన్నింటిలోను ప్రక్రియను అందుబాటులోకి తీసుకు వచ్చాం. కొన్ని రోజుల తరువాత వాటికి అమలు చేస్తాం. ఈ విధానం ద్వారా బిల్లులు ఏవిధంగా చెల్లించవచ్చో..వీడియోల ద్వారా ప్రచారం చేస్తున్నాం.

- శేషాద్రి శేఖర్, ఎస్‌ఈ, విద్యుత్ శాఖ

సొసైటీలకు

జవసత్వాలు

జిల్లా సహకార శాఖాధికారి (డీసీఓ) అరుణ



అనంతపురం క్లాక్‌టవర్, మే 7(ఆంధ్రజ్యోతి): సొసైటీలకు జవసత్వాలు ఇవ్వనున్నట్లు జిల్లా సహకార శాఖాధికారి (డీసీఓ) అరుణకుమారి తెలిపారు. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘా(పీఏసీఎస్)లను అతి త్వరలో మల్టీ పర్పస్ క్రెడిట్ సొసైటీలుగా మార్చేందుకు ప్రభుత్వాలు శ్రీకారం చుట్టాయనీ, దీంతో వాటి స్వరూపమే మారిపోతుందన్న డీసీఓతో 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూ..

ఇంటర్వ్యూ Interview

ప్రశ్న: జిల్లాలో ఎన్ని ప్రాథమిక సహకార వ్యవసాయ పరపతి సంఘాలున్నాయి..?

డీసీఓ: జిల్లాలో 58 సొసైటీలున్నాయి. వీటి ద్వారా రైతులు, ప్రజలకు సేవలు అందిస్తున్నాం.

ప్రశ్న: సొసైటీల కంప్యూటరైజేషన్ ఏ మేరకు పూర్తయింది?

డీసీఓ: జిల్లాలో కంప్యూటరైజేషన్ విజయవంతంగా పూర్తిచేశాం. రాష్ట్రంలోనే ద్వితీయ స్థానంలో నిలిచాం. ఇక సొసైటీల్లో అన్ని లావాదేవీలు, ఆడిట్ కూడా ఆన్‌లైన్‌లో నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది.

ప్రశ్న: మల్టీపర్పస్ క్రెడిట్ సొసైటీలుగా మార్చితే ఉపయోగాలేంటి?

డీసీఓ: సొసైటీలను బలోపేతం చేసి గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు, రైతులకు ఇదివరకు పనిచేసిన మీ-సేవ కేంద్రాల తరహాలో అన్నిరకాల సేవలు అందించే అవకాశం ఉంటుంది. మొబైల్ రీచార్జితో మొదలుకుని విద్యుత్తు బిల్లులు, టిక్కెట్ బుకింగ్ ఇలా అనేక రకాల సేవలు సీఎస్‌సీల ద్వారా అందించవచ్చు. రైతులకు తక్కువ ధరకే నాణ్యమైన విత్తనాలు అందించేందుకు సీడ్ సొసైటీ, సేంద్రియ వ్యవసాయం ప్రోత్సహించేందుకు ఆర్గానిక్ సొసైటీ, రైతులు పండించిన పంటలను ఎగుమతి చేసేందుకు ట్రాన్స్‌పోర్ట్ సొసైటీలతో సహకార సంఘాలను అనుసంధానం చేసి, గోడౌన్లను నిర్మించారు. పేదలకు తక్కువ ధరకే మందులు అందించేందుకు జన ఔషధి పేరుతో జనరిక్ మెడికల్ షాపులు ప్రారంభించనున్నారు. పెట్రోలు బంకులు సైతం ఏర్పాటు చేస్తున్నాం.

ప్రశ్న: రైతులకు ఆధునిక వ్యవసాయ యంత్రాలు అందజేస్తారా..?

డీసీఓ: ఆధునిక వ్యవసాయ సాంకేతిక పరికరాలు మల్టీపర్పస్ క్రెడిట్ సొసైటీల్లో అందుబాటులో ఉంచే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. నామమాత్రపు అద్దెతో వాటిని అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తోంది. ఇది రైతులకు ఎంతో ఉపయోగకరం.

డ్రోన్‌సాయం..!

- చెట్ల ఎదుగుదల, తెగుళ్లపై రైతులకు సూచనలు
- పైలెట్ ప్రాజెక్టుగా ముకుందాపురం ఎంపిక
- ఇప్పటికే సర్వే పూర్తి

- చీనీకి సాంకేతిక దన్ను
- డ్రోన్ ద్వారా పంటల పర్యవేక్షణ



గార్లదిన్నె మండలం ముకుందాపురం వద్ద చీనీ తోటలో జీపీఎస్ ట్రాకింగ్‌ను పరిశీలిస్తున్న ఉద్యాన శాఖ డీడీ ఫిరోజ్ ఖాన్, హెచ్‌ఓ రత్నకుమార్

అనంతపురం అర్బన్/గార్లదిన్నె, మే 7(ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో సాంకేతికత వినియోగానికి నూతన ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. తద్వారా అన్నదాతకు అండగా నిలవాలని భావిస్తోంది. వ్యవసాయాన్ని డ్రోన్ సాయంగా మార్చే దిశగా అడుగులు పడుతున్నాయి. జిల్లాలో విస్తారంగా సాగవుతున్న ఉద్యాన పంట చీనీ సాగులో సాంకేతికతను వినియోగించేలా చర్యలు చేపడుతోంది. సీజన్ల వారీగా పంటకు సోకే తెగుళ్లపై ముందస్తుగా రైతులకు సంక్షిప్త సమాచారం అందించేందుకు ప్రభుత్వం వినూత్న పద్ధతికి శ్రీకారం చుట్టింది.

పైలెట్ ప్రాజెక్టుగా ముకుందాపురం

జిల్లావ్యాప్తంగా 95వేల ఎకరాల్లో చీనీ సాగు చేస్తున్నారు. గార్లదిన్నె మండలంలోనే 22 వేల ఎకరాల్లో పంట సాగవుతోంది. మండలంలోని ముకుందాపురానికి చెందిన 1,711 మంది రైతులు 4,830 ఎకరాల్లో చీనీ పంట పెట్టారు. రాష్ట్ర ఉద్యాన శాఖ కమిషన్ ఆదేశాల మేరకు అత్యధికంగా చీనీ పంట సాగులో ఉన్న ముకుందాపురం గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశారు. మూడు రోజులపాటు 34 బృందాలతో జియోకోఆర్డినేటర్ల ద్వారా సర్వే చేశారు. ఒక్కో బృందంలో వీహెచ్‌ఏ, ఎఫ్‌సీఓలు పనిచేశారు. గ్రామంలోని చీనీ తోటలను ఉద్యాన, ఏపీఎంఐపీ అధికారులు, సిబ్బంది జీపీఎస్ సర్వే చేశారు. ముకుందాపురం గ్రామంలోని 1,355 మంది రైతులకు సంబంధించి 4,247 ఎకరాల్లో జీపీఎస్ ట్రాకింగ్ చేసి, చీనీ తోటలకు సంబంధించి పాలిగాన్ మ్యాప్‌లు రూపొందించారు. ఆ మ్యాప్‌లను ఉద్యాన శాఖ కమిషనరేట్‌కు పంపించారు. హైదరాబాద్‌కు చెందిన 3 ఎఫ్ (ఫుడ్, ఫ్యాట్, ఫర్టిలైజర్) కంపెనీ సాంకేతిక సహకారంతో జీపీఎస్ ట్రాకింగ్ ఆధారంగా డ్రోన్ ద్వారా మూడురోజులపాటు ముకుందాపురం గ్రామంలోని చీనీ తోటలపై సర్వే చేశారు. పైలెట్ ప్రాజెక్టు విజయవంతమైతే అన్ని రకాల ఉద్యాన పంటలకు డ్రోన్ సర్వే చేసి, రైతులకు మెరుగైన సేవలు అందించాలనే యోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ నిర్ణయంపై ఉద్యాన రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



పంటలో డ్రోన్ ద్వారా సర్వే చేస్తున్న దృశ్యం (ఫైల్)

డ్రోన్లతో పర్యవేక్షణ

చీనీ పంట తెగుళ్ల బారన పడుతుండడంతో చెట్లు దెబ్బతిని, దిగుబడులు తగ్గుతున్నాయి. తద్వారా రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. ఈ క్రమంలో సాంకేతికత సాయంతో పంట ఆరోగ్యాన్ని అంచనా వేయడంతోపాటు తెగుళ్లపై పర్యవేక్షణ చేపట్టనున్నారు. ఇన్‌ఫ్రారెడ్, మల్టీస్పెక్ట్రల్ కెమెరాలతో కూడిన డ్రోన్ సర్వే ద్వారా ఉద్యాన పంటల్లో పోషక లోపాలు, నీటి ఒత్తిడి, తెగుళ్ల బెడద తదితర సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తిస్తారు. దాని ఆధారంగా పంటకు సోకిన తెగుళ్లు, ఇతర దుష్ప్రభావాల నివారణకు ముందస్తుగానే రైతులకు సమాచారం ఇవ్వనున్నారు. కచ్చితమైన జీపీఎస్ మ్యాపింగ్ ద్వారా ఈ ప్రక్రియను చేపట్టినట్లు ఉద్యాన అధికారులు పేర్కొంటున్నారు. డ్రోన్ సర్వే ద్వారా నేలలో తేమ, మొక్కల ఆరోగ్యం, కలుపు మొక్కల వృద్ధిని క్షేత్ర పరిస్థితులకు సంబంధించి వివరణాత్మక చిత్రాలను రూపొందిస్తారు.

డ్రోన్ సర్వే ద్వారా చాలా ఉపయోగాలున్నాయి. ప్రాథమిక దశలోనే పంటలకు సోకే తెగుళ్లను గుర్తించడం ద్వారా అనవసరంగా పురుగు మందుల వాడకాన్ని తగ్గించవచ్చు.



చీనీ తోటలో జీపీఎస్ ట్రాకింగ్‌పై శిక్షణ ఇస్తున్న అధికారులు

ఉపయోగాలు..

పంటలకు సోకే తెగుళ్లతోపాటు నేలలో తేమ శాతాన్ని గుర్తిస్తుంది. తద్వారా నీటి వృథాను తగ్గించవచ్చు. డ్రోన్ల ద్వారా సేకరించిన డేటా ఆధారంగా పంటలకు నష్టం వాటిల్లినపుడు పంటల బీమా, పంటనష్ట పరిహారం అందించే అవకాశం ఉంటుంది. తెగుళ్ల నివారణకు పిచికారీ చేసుకోవాల్సిన పురుగుమందులతోపాటు ఏయే రకాల ఎరువులు వాడితే పంట ఎదుగుదలకు ఉపయోగపడుతుందన్న సమగ్ర సమాచారాన్ని అందిస్తారు. పంట నిర్వహణకు రైతులకు సకాలంలో కచ్చితమైన నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుంది.



డ్రోన్ ద్వారా తీసిన ఫొటో

రైతులకు చాలా ఉపయోగం



రాష్ట్ర ఉద్యాన శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అత్యధికంగా చీనీ సాగవుతున్న ముకుందాపురం గ్రామాన్ని ఎంపిక చేశాం. గ్రామంలో చీనీ సాగు చేసే రైతులకు సంబంధించిన పొలాన్ని నాలుగు దిక్కులా జీపీఎస్ ద్వారా సర్వే చేసి, పాలిగాన్ మ్యాప్‌లు తయారు చేశాం. తోట ఎలా ఉంటే పాలిగాన్ మ్యాప్‌లు అలాగే ఉంటాయి. ఇందులో రైతు పేరు, సర్వే, ఖాతా నంబర్లతోపాటు ఎంత విస్తీర్ణంలో చీనీ సాగు చేశారన్న వివరాలు ఉంటాయి. పైలెట్ ప్రాజెక్టు కింద ప్రీ కౌంట్-ప్రీ హెల్త్ నినాదంతో హైదరాబాద్‌కు చెందిన 3 ఎఫ్ (ఫుడ్, ఫ్యాట్, ఫర్టిలైజర్) కంపెనీ సాంకేతిక సహకారంతో డ్రోన్ సర్వే పూర్తి చేశాం. తొలి విడతలో ముకుందాపురం గ్రామంలోని 1,355 మంది రైతులకు సంబంధించి 4,247 ఎకరాల్లో జీపీఎస్ ట్రాకింగ్ చేసి, తోటలకు సంబంధించిన పాలిగాన్ మ్యాప్‌లు రూపొందించాం. ఉద్యాన శాఖ కమిషనరేట్‌కు పంపించాం. ఆయా రైతుల చీనీ తోటలకు సంబంధించిన జీపీఎస్ కోఆర్డినేట్లను శాటిలైట్‌కు అనుసంధానం చేస్తారు. డ్రోన్ సర్వే ద్వారా చీనీ తోటలకు సోకిన పలు రకాల చీడపీడలు, తెగుళ్లపై ఆర్‌ఎన్‌డీ సంస్థ ద్వారా రైతుల సెల్‌ఫోన్‌కు సంక్షిప్త సమాచారంతో డ్రోన్ అలర్ట్ వెళ్తుంది. తద్వారా ఏయే రకాల తెగుళ్ల సోకాయి..? అందుకు ఏ మందులు పిచికారీ చేసుకోవాలన్న దానిపై రైతులకు అవగాహన కల్పించవచ్చు.

- ఫిరోజ్‌ఖాన్, ఉద్యాన శాఖ డీడీ

కొత్త రేషన్‌కార్డులకు ఓకే

- మార్పుచేర్పులకు అవకాశం
- గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తుల స్వీకరణ



జిల్లా పౌరసరఫరాల శాఖ కార్యాలయం

అనంతపురంటౌన్, మే 7(ఆంధ్రజ్యోతి): కొత్త రేషన్‌కార్డుల జారీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. కొన్నేళ్లుగా అర్హత ఉండి రేషన్‌కార్డు కోసం అనేకమంది ఎదురుచూస్తున్నారు. రేషన్ కార్డుల్లో తప్పులను సవరించుకునేందుకు, అడ్రస్ మార్పు, కుటుంబసభ్యులను కార్డులో నమోదు చేయించుకునేందుకు వేలాదిమంది లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు. ఈ అప్షన్లను గత వైసీపీ ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదు. దీంతో కార్డుదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొత్త ప్రభుత్వం కొలువుదీరాక అర్హులందరికీ కొత్తరేషన్ కార్డులు ఇస్తామని ప్రకటించింది. కొన్ని నెలలుగా అదిగో.. ఇదిగో.. అంటూ ప్రచారం సాగుతూ వచ్చింది. ఎట్టకేలకు కొత్తరేషన్ కార్డుల జారీకి సర్కారు సై అంది. ఆ మేరకు పౌరసరఫరాల శాఖ కమిషనర్ సౌరబ్‌గౌర్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఏళ్లగా ఎదురుచూస్తున్న లబ్ధిదారుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

దరఖాస్తులు ప్రారంభం

కొత్త రేషన్‌కార్డుల దరఖాస్తుల పక్రియ బుధవారం నుంచే మొదలు పెట్టారు. జిల్లాలో ఇప్పటివరకు అధికారిక లెక్కల మేరకు 6.60లక్షల రేషన్‌కార్డులున్నాయి. వీటిలోని లబ్ధిదారుల్లో చాలామంది చనిపోయారు. ఉమ్మడి కుటుంబం నుంచి విడిపోయినోళ్లు ఉన్నారు. వివాహమైన వారు, పేర్లు తప్పుగా నమోదైనోళ్లు ఉన్నారు. వీరందరూ కొత్తకార్డులతోపాటు మార్పుచేర్పులు చేసుకునేందుకు ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు ఎక్కడకు వెళ్లినా వినతులు ఇస్తున్నారు. ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలోనూ అధికార యంత్రాంగానికి అర్జీలు సమర్పిస్తున్నారు. పౌరసరఫరాల శాఖ వర్గాలు చెబుతున్న సమాచారం మేరకు 50వేలకుపైగా వినతులు ఉంటాయి. ప్రభుత్వం నుంచి ఎలాంటి ఉత్తర్వులు లేకపోవడంతో అవన్నీ కార్యాలయాలకే పరిమితమమయ్యాయి. ప్రస్తుతం సర్కారు సై అనడంతో వీరందరూ దరఖాస్తు చేసుకోవచ్చు. కొత్త రేషన్ కార్డు, కుటుంబసభ్యుల విభజన, పాతకార్డులో పేర్ల నమోదు, చిరునామాల మార్పు, చనిపోయిన వారి పేర్ల తొలగింపు కోసం దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఈ దరఖాస్తులను గ్రామ, వార్డు సచివాలయాల్లో అందజేయవచ్చు.

ఉత్తర్వులు వచ్చాయి

కొత్త రేషన్‌కార్డులకు దరఖాస్తులు స్వీకరించడానికి రాష్ట్ర కమిషనర్ నుంచి ఉత్తర్వులు వచ్చాయి. గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చు. మార్పుచేర్పులకు అవకాశం కల్పించారు. ఈ పక్రియ బుధవారమే ప్రారంభమైంది. సోమవారం నుంచి వాట్సాప్ ద్వారా కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ అవకాశాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలి.

-జగన్నాథరావు, ఇన్‌చార్జి డీఎస్‌ఓ

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

స్వామి చిన్మయానంద సరస్వతి (జయంతి)



హిందూ ఆధ్యాత్మికవేత్తగా చిన్మయ మిషన్‌ను స్థాపించి అద్వైత వేదాంతాన్ని, భగవద్గీతను, ఉపనిషత్తులను ప్రపంచ వ్యాప్తంగా విస్తరించేలా బోధనలు చేసిన స్వామి చిన్మయానంద సరస్వతి 1916 మే 8న కేరళ రాష్ట్రం ఎర్నాకులంలో జన్మించారు. అసలు పేరు బాలకృష్ణ మీనన్. పాత్రికేయుడిగా కెరీర్‌ను ప్రారంభించి 33వ యేట సన్యాసదీక్ష తీసుకున్నారు. విశ్వహిందూ పరిషత్ సహసంస్థాపకుడు. 300కుపైగా సెంటర్లతో జాతీయ, అంతర్జాతీయంగా మిషన్ పనిచేస్తోంది. విద్య, వైద్య, సమాజసేవకు మిషన్ కృషి చేస్తోంది. 1970లో చిన్మయ మిషన్ ఆసుపత్రిని బెంగళూరులో ఏర్పాటు చేశారు. 1993 ఆగస్టు 3న నిర్యాణం చెందారు.

గిరిజాదేవి (జయంతి)



'పద్మవిభూషణ్' గ్రహీత గిరిజాదేవి 1929 మే 8న వారణాసిలో జమీందారు కుటుంబంలో జన్మించారు. శాస్త్రీయ గీతాలాపనలో ప్రత్యేకించి బెనారస్ ఘరానాలో పేరొందారు. క్లాజికల్, లైట్ క్లాజికల్‌లో రాణించి తుమ్రి సంప్రదాయానికి వన్నె తెచ్చారు. కోల్కత్తాలోని ఐటీసీ సంగీత్ రీసెర్చ్ అకాడమీలో ఫ్యాకల్టీ సభ్యురాలిగా కొనసాగారు. సంగీత నాటక అకాడమీ, మహాసంగీత్ సమ్మాన్ తదితర అవార్డులు పొందారు. 2017 అక్టోబరు 24న కన్నుమూశారు.

డేవిడ్ అట్టెన్‌బరో (పుట్టినరోజు)



ఇంగ్లిష్ బ్రాడ్ కాస్టర్‌గా, నేచురల్ హిస్టోరియన్‌గా పేరొందిన సర్ డేవిడ్ ఫెడరిక్ అట్టెన్‌బరో 1926 మే 8న జన్మించారు. ప్రత్యేకించి బీబీసీలో మేనేజర్‌గా, డైరెక్టర్‌గా వ్యవహరించారు. నేచరల్ హిస్టరీ యూనిట్‌లో 9 డాక్యుమెంటరీలు తీశారు. బ్లాక్ అండ్ వైట్, కలర్, హెచ్‌డీ, 3డీ, 4కేలలో బాఫ్టా అవార్డులు పొందిన ఏకైక వ్యక్తి. జీవవైవిధ్యంపై ప్రజలలో అవగాహన కల్పించి ప్రకృతిని కాపాడుకోవాలని ఆకాంక్షించేలా చైతన్యపరిచారు. 2022లో యునైటెడ్ నేషన్స్ ఎన్విరాన్‌మెంట్ ప్రోగ్రామ్ ఆయనను 'చాంపియన్ ఆఫ్ ది ఎర్త్'గా గుర్తించింది.



పేలుడుతో దెబ్బతిన్న రోడ్డు



డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు...

రాఘవేంద్ర కాలనీలో పేలుడు

దొమ్మసంద్ర, మే 7(ఆంధ్రజ్యోతి): ఆనేకల్ తాలూకా చందాపుర హోబళి బనహళ్ళి రాఘవేంద్ర కాలనీలో జరిగిన పేలుడు ఘటనతో సిమెంట్ కాంక్రీట్‌రోడ్డు దెబ్బతింది. మంగళవారం ఈ ఘటన చేసుకుంది. భారీ శబ్ధంతో స్థానికులు బెంబేలెత్తారు. ప్రాణభయంతో స్థానికులు సూర్యనగర్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. రాఘవేంద్ర కాలనీలో వాటర్‌ట్యాంకర్ వెళ్లిన కొద్దిసేపటికే భారీ శబ్దం వినిపించింది. సూర్యనగర్ పోలీసులు డాగ్‌స్క్వాడ్‌తో క్షుణ్ణంగా ఈ ప్రదేశాన్ని తనిఖీ చేశారు. అండర్ గ్రౌండ్‌లో 220కేవీ హై ఓల్టేజ్ వైర్లు బొమ్మసంద్ర, యారండహళ్ళి నుంచి తమిళనాడుకు వెళ్తాయి. ఎర్తింగ్ జోన్‌లో సమస్యలు తలెత్తడంతో భారీ శబ్దానికి దారి తీసిందని చందాపుర కేపీటీసీఎల్ అధికారి మహేశ్ తెలిపారు. యారండహళ్ళి నుంచి తమిళనాడుకు వెళ్లే విద్యుత్‌లైన్ మార్గంలో ఏర్పడిన సమస్యను బాగు చేస్తామని, ప్రజలు భయపడాల్సిన అవసరం లేదన్నారు. దీంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.



సీఎంను స్వాగతిస్తున్న మాజీ చీఫ్ సెక్రటరీ రత్నప్రభ

ఉమెన్ ఆఫ్ వర్త్ సదస్సుకు సీఎంకు ఆహ్వానం

బెంగళూరు, మే 7 (ఆంధ్రజ్యోతి): మహిళా పారిశ్రామికవేత్త సాధకుల ఉమెన్ ఆఫ్ వర్త్ వావ్ సదస్సుకు సీఎం సిద్దరామయ్యను స్వాగతించారు. ఉబుంటు మహిళా బృందం బుధవారం సీఎం అధికారిక నివాసం కావేరిలో భేటీ అయ్యారు. జూన్ 4న జరిగే వావ్ ఐదో విడత సదస్సులో భాగస్వామ్యులు కావాలని కోరారు. మాజీ చీఫ్ సెక్రటరీ రత్నప్రభతోపాటు పలువురు సభ్యులు పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 3వేలమంది మహిళా పారిశ్రామికవేత్తలకు శిక్షణలు ఇచ్చామని, రెండేళ్లలో 10వేలమందికి శిక్షణలు ఇచ్చే లక్ష్యంగా ఉందన్నారు.

ప్రతిపక్షనేతవి అసత్య ఆరోపణలు..



వెంకటరెడ్డి పాటిల్

బెంగళూరు, మే 7(ఆంధ్రజ్యోతి): మార్క్స్‌కార్డ్‌ను ప్రింటింగ్ చేసే ఊర్వ కంపెనీపై పరిషత్ ప్రతిపక్షనేత ఛలవాది నారాయణస్వామి అసత్య ఆరోపణలు చేశారని సంస్థ ముఖ్యులు వెంకటరెడ్డి పాటిల్ మండిపడ్డారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ ఊర్వ మేనేజిమెంట్ ప్రైవేట్ లిమిటెడ్‌పై ప్రతిపక్షనేత ఆధారాలు లేని ఆరోపణలు చేశారన్నారు. టెండరు ప్రక్రియ ప్రస్తుతం కోర్టులో ఉందన్నారు. మా కంపెనీ ఇంతవరు మార్కుల జాబితాను ముద్రించలేదని అయినా బ్లాక్‌లిస్ట్‌లోకి పోయిందని ఆరోపించారన్నారు. ఆధారాలు రుజువు చేయాలని లేదా బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

భక్తిశ్రద్ధలతో దీపోత్సవం

విజయపుర, మే 7(ఆంధ్రజ్యోతి): దేవనహళ్ళి తాలూకా విజయపుర హోబళి మండిబెలె గ్రామపంచాయతీ పరిధిలోని తిమ్మనహళ్ళిలో ఐదు దేవతామూర్తుల దీపోత్సవం వైభవంగా జరిగింది. తొమ్మిదేళ్ల అనంతరం హొలేరహళ్ళి మునేశ్వర, లఘుమమ్మ దేవి, ఆంజనేయస్వామి, తిమ్మనహళ్ళి మునేశ్వర సహా గ్రామదేవతలకు నెత్తిపై దీపాలు మోసి వెలిగించారు. పిల్లలు, పెద్దలు భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



గ్రామదేవతల జాతరలో పాల్గొన్న భక్తులు



చేళూరులో అమ్మవారికి అలంకరణ, జయనగర్ సిద్ధాపురలో..

వాసవాంబకు వందనం..!

బెంగళూరు, మే 7 (ఆంధ్రజ్యోతి): కన్యకాపరమేశ్వరి ఆలయాలలో వాసవి మాత జయంతి వేడుకలు వైభవంగా సాగాయి. నగరంలోని వివిపురం, చామరాజపేట, జయనగర్, మల్లేశ్వరం, సంపంగిరామనగర్, గిరినగర్, యలహంకతోపాటు పలు ఆలయాలలో బుధవారం ఉదయంనుంచే ప్రత్యేకపూజలు కొనసాగాయి. కన్యకా పరమేశ్వరిమాతకు ప్రత్యేక అలంకరణలు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. వివిధ అలంకరణలు, రూపాలలో అమ్మవారు దర్శనమిచ్చారు. ప్రతి ఆలయంలోనూ వివిధ హోమాలు కొనసాగించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలోని కన్యకా పరమేశ్వరి ఆలయాలలో జయంతి వేడుకలు కొనసాగాయి.

బాగేపల్లిలో..

బాగేపల్లి: పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో వాసవి జయంతిని పురస్కరించుకు హోమాలు, పూజా కైంకర్యాలు నిర్వహించారు. ఉత్సవమూర్తికి క్షీరాభిషేకం, మూల విరాట్టుకు పంచామృతాభిషేకం, గంగపూజ, కళశస్థాపన, గణపతి, నవగ్రహ, అష్టదిక్పాలక హోమం తదితర పూజలు చేశారు. పట్టణంలోని డీవీజీ రోడ్డులో వాసవి మాత ఉత్సవమూర్తిని కళాబృందాల నడుమ ముత్యాల పల్లకీలో ఊరేగించారు.

ముళబాగిలులో..

ముళబాగిలు: పట్టణంలోని బజారురోడ్డులోని వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయంలో 65వ వాసవిజయంతిని పురస్కరించుకుని విశేషపూజలు నిర్వహించారు. 102లీటర్ల పాలు, పెరుగుతో అభిషేకం, హోమాలు నిర్వహించారు. శ్రీవారి సమృద్ధి భజనామండలి ఆధ్వర్యంలో భజన కొనసాగింది.

జయనగర్‌లో...

ఆర్యవైశ్యుల కులదేవత వాసవీమాత జయంతిని రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. నగరంలోని జయనగర్ ఒకటో బ్లాక్ లాల్‌బాగ్ సిద్ధాపురలో వాసవి జయంతిని పురస్కరించుకుని బుధవారం ఉదయం గంగపూజ, మహాగణపతి ఆరాధన, స్వస్తి పుణ్యాహ కళశస్థాపన, అమ్మవారికి పంచామృతాభిషేకం, అలంకరణ, తర్వాత గణపతి హోమం, నవగ్రహ హోమం, దిక్పాలక హోమం, వాసవి అష్టోత్తర హోమం, మహాబలి, పూర్ణాహుతి అనంతరం మహామంగళారతి చేసి భక్తులకు తీర్థప్రసాదం పంపిణీ చేశారు. ఆర్యవైశ్య మండలి, మహిళామండలి, యువజన మండలి సభ్యులు పాల్గొన్నారు.

చేళూరులో...

చేళూరు: తాలూకా కేంద్రమైన చేళూరులో కందుకూరు మార్గంలోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో వాసవిజయంతిని పురస్కరించుకుని బుధవారం విశేషపూజలు నిర్వహించారు. అమ్మవారికి అభిషేకం, అలంకరణ చేశారు. మధ్యాహ్నం మహామంగళారతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తిని పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

చింతామణి : చింతామణి దొడ్డపేటలోని వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయంలో బుధవారం వాసవి దేవాలయ ట్రస్టు ఆధ్వర్యంలో వాసవిజయంతి వేడుకలు సాగాయి. ఉదయం సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, వివిధ హోమాదికాలు నిర్వహించారు. 102 గోత్రాల వాసవి కళశస్థాపన, పూర్ణాహుతి, మహామంగళారతి, మధ్యాహ్నం ప్రాకారోత్సవం, మహామంగళారతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అన్నసంతర్పణ నిర్వహించారు. రాత్రి అమ్మవారిని పురవీధులలో ఊరేగించారు



గిరినగర్‌లో..



చింతామణిలో..

కాలువ వెడల్పుతోనే ప్రయోజనం

విడపనకల్లు, మే 9(ఆంధ్రజ్యోతి): రాయలసీమలోని అనంతపురం, చిత్తూరు, జిల్లాలకు సాగు, తాగునీరు కావాలంటే హంద్రీనీవా కాలువను వెడల్పు చేయాలని ఎమ్మెల్సీ శివరామిరెడ్డి పేర్కొన్నారు. వజ్రకరూరు మండలంలోని కొనకొండ్ల గ్రామంలో గల తన గృహంలో ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ.. హంద్రీనీవా కాలువను 3,850 క్యూసెక్కుల సామర్థ్యంతో తవ్వితే 2200 క్యూసెక్కులు మాత్రమే పారిస్తున్నారన్నారు. 10వేల క్యూసెక్కులు పారేలా పనులు చేపట్టాలన్నారు. అధికంగా వచ్చే నీటిని నిల్వ చేసుకునేందుకు జీడిపల్లి రిజార్వాయర్ సామర్థ్యాన్ని 4 టీఎంసీలకు పెంచాలని కోరారు. ప్రభుత్వం.. రాయలసీమకు న్యాయం చేయాలంటే కాలువను వెడల్పు చేయాలన్నారు.

తలసేమియా నియంత్రణకు అప్రమత్తత తప్పనిసరి

బెంగళూరు, మే 7(ఆంధ్రజ్యోతి): దేశంలో తలసేమియా ప్రభావం పెరుగుతోందని సకాలంలో పరీక్షలు జరిపించుకోవాల్సిన అవసరం ఉందని ప్రముఖ వైద్యులు డాక్టర్ రాధేశ్యామ్‌నాయక్ అభిప్రాయపడ్డారు. ప్రపంచ తలసేమియా డేను పురస్కరించుకుని రాధేశ్యామ్‌నాయక్ మాట్లాడుతూ ఏటా 10వేలమంది చిన్నారులు తలసేమియాతో జన్మిస్తున్నారన్నారు. సకాలంలో స్క్రీనింగ్, బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్‌లు సముచితమైన వైద్య విధానమని కొనియాడారు. రక్తహీనతను సకాలంలో గుర్తించలేకపోతున్నారని, ఈ వ్యాధినబారిన పడినవారు చాలామంది తీవ్రమైన ప్రమాదానికి బాధితులు అవుతున్నారన్నారు. సుదీర్ఘకాలం రక్తహీనత, శ్వాసకోశ, వివిధ అవయవాలు సక్రియంగా పనిచేయకపోవడం కారణంగా ఎముకలపై తీవ్ర ప్రభావం చూపనుందన్నారు. ఐరన్‌శాతం లోపించడంతో హృదయ, కిడ్నీ వంటి అవయవాల వైఫల్యానికి దారి తీస్తుందన్నారు. తలసేమియాను సకాలంలో గుర్తించేందుకు మనిషి కొన్ని నెలల వ్యవధిలో బలహీనం ఎందుకు అవుతున్నారనేది గుర్తించాలన్నారు. వెంటనే వైద్యుల సలహాలు పాటించాలని సూచించారు. తలసేమియాపై ప్రజలలో అవగాహన కల్పించడమే ప్రధానమైన ప్రయోగమన్నారు.

చెక్‌బౌన్స్ కేసులో టీచర్‌కు జైలుశిక్ష

హిందూపురం, మే 7(ఆంధ్రజ్యోతి): చెక్‌బౌన్స్ కేసులో ఉపాధ్యాయురాలికి మూడు నెలల జైలుశిక్ష విధిస్తూ హిందూపురంలోని ప్రత్యేక కోర్టు న్యాయాధికారి రమణయ్య బుధవారం తీర్పు ఇచ్చారు. ప్రస్తుతం లేపాక్షి మండలం మైదుగోళం ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న సత్యవతి హిందూపురానికి చెందిన నేత్రావతి వద్ద రూ.3లక్షలు అప్పు తీసుకుంది. డబ్బులు తిరిగి చెల్లించడానికి చెక్కు ఇచ్చింది. అది బ్యాంక్‌కు కలెక్షన్ కోసం వెళ్లగా బౌన్స్ అయింది. దీంతో బాధితురాలు నేత్రావతి కోర్టుకు వెళ్లింది. విచారించిన ప్రత్యేక కోర్టు న్యాయాధికారి ఉపాధ్యాయురాలు సత్యవతికి మూడునెలల జైలుశిక్ష, రూ.3లక్షల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చినట్లు బాధితురాలు నేత్రావతి న్యాయవాది సంపత్‌కుమార్ తెలిపారు.

నీటి కుంటల్లోకి పెట్టి అందిస్తున్నాం



మాకు రెండు బోర్లలో కలిసి ఒక ఇంచుదాకా నీరు వస్తుంది. ఆ నీటిని కుంటల్లో నింపుకుని ఆ తరువాత చీనీ చెట్లకు పెట్టుకుంటున్నాం. పూర్తి స్థాయిలో నీరు అందకపోవడంతో కొద్దిగా కొద్దిగా నీరందిస్తూ చెట్ల ప్రాణాలు కాపాడుకుంటున్నాం. ఇప్పుడు వస్తున్న నీరు ఎప్పుడు పోతోందో తెలియదు.

- బయన్న, రైతు, కునుకుంట్ల



నీటి కుంటను చూపుతున్న బయన్న

నరికివేసిన చీనీచెట్లు

ట్యాంకర్ల ద్వారా నీరు అందిస్తున్న రాజనరసింహుడు

అయ్యో..! పీబీసీ

పులివెందుల బ్రాంచ్ కెనాల్‌లో పారని నీరు

తాడిమర్రి, మే 7(ఆంధ్రజ్యోతి): దాదాపు మూడు దశాబ్దాలకు పైగా కరువు నేలపై సిరులు పండటానికి కారణమైన పీబీసీ (పులివెందుల బ్రాంచ్ కెనాల్) ప్రస్తుతం నిర్వీర్యమైపోతోంది. మండల సరిహద్దులో నిర్మించిన చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు హెచ్చెల్సీ ద్వారా తుంపెర డీప్‌కట్ నుంచి నీరు అందించేందుకు పీబీసీని అప్పట్లో ఏర్పాటుచేశారు. దీనికి అనుసంధానంగా రామాపురం వద్ద ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించారు. దీని ద్వారా ముచ్చుకుంటపల్లి, రామాపురం గ్రామాలకు తాగునీరు అందించే ఏర్పాటు చేశారు. ప్రతి సంవత్సరం మూడు టీఎంసీలు నీరు ఈ కాలువ ద్వారా చిత్రావతి డ్యాంకు చేరేలా జీఓ కూడా ఇచ్చారు. కాలువ గుండా నీరు పారుతుండటంతో భూగర్భ జలాలు పెరిగి సమీప గ్రామాల రైతులు పంటలు బాగానే పండించుకున్నారు.

పలు గ్రామాల్లో తాగు, సాగునీటి సమస్య

పండ్ల తోటలను కాపాడుకునేందుకు రైతుల అవస్థ

పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

అమాత్యులైనా హామీని నెరవేర్చేరా..?

2017 నుంచి సమస్య

2004లో కాంగ్రెస్ ప్రభుత్వం పీబీసీని ఆధునీకరించేందుకు రూ.100కోట్లతో పనులు ప్రారంభించింది. దాదాపు 90శాతం పనులు కూడా పూర్తి చేశారు. అయితే 2017 నుంచి ఈ కాలువకు నీటి కేటాయింపులు తగ్గుతూ వచ్చాయి. 2019లో వైసీపీ పాలనలో కాలువకు నీరు వదలడం పూర్తిగా మానేశారు. గండికోట రిజర్వాయర్ నుంచి మైలవరం, అక్కడి నుంచి గొడ్డుమర్రి, అక్కడి నుంచి చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు మూడు లిఫ్టిసిస్టంల ద్వారా నీరు తెచ్చి, ప్రతిఏటా 6 టీఎంసీలు నిల్వ ఉంచుతున్నారు. ఎగువ నుంచి కాకుండా దిగువ నుంచి నీళ్లు తెచ్చి సీబీఆర్‌ను నింపుతుండటంతో భవిష్యత్తులో పీబీసీ పరిస్థితి ఏమిటోనని రైతులు ఆందోళన చెందారు. అప్పటి ప్రజాప్రతినిధుల ద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి కొంతవరకు నీటిని విడుదల చేయించారు. అయితే ఆ నీరు రామాపురం ఎత్తిపోతల పథకానికే సరిపోతోంది. కునుకుంట్ల, చిల్లకొండయ్యపల్లి, నార్పల మండలం ముచ్చుకుంటపల్లి గ్రామాలకు తాగునీరు అందడం గగనం అయిపోయింది. కునుకుంట్ల గ్రామంలో 1.5లక్షలకు పైగా చీనీచెట్లు సాగులో ఉన్నాయి. రామాపురం, చిల్లకొండయ్యపల్లి గ్రామంలో చీనీ, అరటి తోటలు సాగులో ఉన్నాయి. ఈ గ్రామాలలో అరకొరగా వస్తున్న నీటిని పంట కుంటల్లో నిల్వ ఉంచుకుని పొలాలకు సరఫరా చేసు కుంటున్నారు. భూగర్భ జలాలు 600 అడుగుల లోతుకు పైగా పడిపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. కొత్తగా బోర్లు తవ్వించినా నీరు లభించడం లేదు. దీంతో కొందరు రైతులు తమ చీనీ చెట్లను బతికించుకునేందుకు ట్యాంకర్ల ద్వారా నీటిని తరలిస్తున్నారు. జిల్లాలోనే అత్యధిక పండ్ల తోటలు సాగు చేస్తున్న గ్రామంగా పేరుగాంచిన కునుకుంట్ల గ్రామం ప్రస్తుతం నీటి కోసం అల్లాడుతోంది. ఈ విపత్కర పరిస్థితిని హెచ్చెల్సీ అధికారులు, మండల అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కనీసం పండ్ల తోటలకు ట్యాంకర్ల ద్వారా నీటిని తరలించేందుకు అయ్యేఖర్చును ప్రభుత్వం అందించడంతో పాటు వచ్చే ఏడాది నుంచి పులివెందుల బ్రాంచ్ కెనాల్‌కు నీటి కేటాయింపులు పకడ్బందీగా జరిగేలా చూడాలని కోరుతున్నారు.



పీబీసీ

మళ్లీ ఆ కాలం వస్తాదో.. రాదో..



పదేళ్ల కిందటి వరకు మా గ్రామంలో ఎక్కడ చూసిన నీరు ఉండేది. పంటలకు అవసరమయ్యే నీరు పుష్కలంగా లభించేది. ఇప్పుడు నీటి కోసం నానా యాతన పడుతున్నాం. అప్పట్లో నీరు బాగా లభించిన పాత బావులన్నీ ఇప్పటికే ఎండు ముఖం పట్టాయి. మే నెల పూర్తయ్యేలోపు ఎన్ని బావుల్లో నీరు ఇంకిపోతుందో..? మరెన్ని బోర్లు ఎండిపోతాయే తెలియడం లేదు.

- దామోదర్‌రెడ్డి, రైతు, కునుకుంట్ల

జీఓను అమలు చేయాలి



తుంపెర డీప్ కట్ వద్ద నుంచి సీబీఆర్‌కు పీబీసీ ద్వారా నీరందించేందుకు గతంలో ప్రభుత్వం ఇచ్చిన జీఓను అమలు పరచాలి. ప్రతిఏటా మూడు టీఎంసీల నీరు ఈ కాలువ ద్వారా ప్రవహించి చిత్రావతికి చేరడం వల్ల ఎత్తిపోతల పథకానికి అయ్యే ఖర్చులు తగ్గుతాయి. రైతులకు నీరు కూడా బాగా లభిస్తుంది.

- రామ్మోహన్, రైతు, రామాపురం


హామీని మంత్రి నెరవేర్చేరా..?

సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ధర్మవరం నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి సత్యకుమార్‌యాదవ్ గత ఏడాది ఏప్రిల్ 16న కునుకుంట్ల గ్రామంలో పర్యటించారు. స్థానిక టీడీపీ మండల కన్వీనర్ కూచిరాము, కునుకుంట్ల నాయకులతో కలిసి ఎండుతున్న చీనీ తోటలను పరిశీలించారు. ఆ సందర్భంలో రైతులు పీబీసీ విషయం సత్యకుమార్ దృష్టికి తీసుకురాగా తమ ప్రభుత్వం ఏర్పాటైన తరువాత తప్పకుండా సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పుడు ఆ హామీని నెరవేర్చాలని రైతులు కోరుతున్నారు.



ఎన్నికలకు ముందు చీనీ రైతులతో మాట్లాడుతున్న సత్యకుమార్‌యాదవ్





తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1584.94	1,577.79
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	2,894	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	283	138
నీటి నిల్వ (టీఎంసీలు)	7.28	3.49

ఆపరేషన్ సింధూర్ సైన్యానికి కాంగ్రెస్ నాయకుల అభినందనలు

రాయచూరు, మే 7(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాద నిర్మూలనం కోసం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ కార్యక్రమాన్ని కాంగ్రెస్ నాయకులు గట్టిగా సమర్థించారు. ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని క్రీడామైదానంలో బుధవారం నిర్వహించ తలపెట్టిన ప్రతిఘటన మహాసభను వాయిదా వేసిన నాయకులు పత్రికల వారితో వేర్వేరుగా మాట్లాడారు. ఉగ్రవాదాన్ని తుది ముట్టించేందుకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వానికి రాజకీయాలు, పార్టీలకు, ప్రాంతాలకు అతీతంగా అందరూ సహకరించాల్సిన అవసరం ఉందంటు నాయకులు అభిప్రాయపడ్డారు.

ఐక్యతతో ముందుకు సాగాలి : మంత్రి డా.శరణ ప్రకాశ్ పాటీల్



దేశ సరిహద్దులో ఉద్రిక్తతలు నెలకొన్న నేపథ్యంలో దేశంలోను ప్రజలందరూ దేశ భద్రత కోసం ఐక్యంగా ముందుకు కదలలన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఆపరేషన్ సింధూర కార్యక్రమాన్ని ప్రతియొక్కరు సమర్థించాలని ఈ క్రమంలోనే తాము ప్రతిఘటన సభను వాయిదా వేసినట్లు తెలిపారు. అదే సమయంలో కాంగ్రెస్ పార్టీ ఉగ్రవాద నిర్మూలన కోసం చేపట్టే ఎలాంటి కార్యక్రమానికైన సంపూర్ణ మద్దతు నిస్తుందన్నారు.

ఉగ్రవాదులపై దాడిని స్వాగతిస్తున్నాం : ఎమ్మెల్సీ వసంత్ కుమార్



ఆపరేషన్ సింధూర పేరుతో ఉగ్రవాద స్థావరాల పై భారత సైన్యం దాడులు జరపడం సమర్థనియమని కేపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎమ్మెల్సీ వసంత్ కుమార్ అన్నారు. ఉగ్రవాదులను తుదుముట్టించేందుకు కేంద్రం చేస్తున్న ప్రయత్నానికి ప్రతియొక్కరం అండగా నిలవాలన్నారు. ఆ ఉద్దేశంతోనే మహెంగాయి హఠావో సంవిధాన బచావో పేరుతో తమ పార్టీ చేపట్టిన కార్యక్రమాన్ని వాయిదా వేసుకున్నట్లు తెలిపారు. దేశ భద్రతకే కాంగ్రెస్ పార్టీ తొలి ప్రాధాన్యమిస్తున్నట్లు వసంత్‌కుమార్ స్పష్టం చేశారు.

సైనిక చర్యకు సంపూర్ణ మద్దతు : ఎంపీ కుమార్ నాయక్



పాక్ ఆక్రమిత కాశ్మీర్ విభాగంలో ఉగ్రస్థావరాల పై భారత సైన్యం జరిపిన దాడులను దేశంలోని ప్రతి పౌరుడు సమర్థిస్తున్నట్లు రాయచూరు లోకసభ సభ్యుడు జీ కుమార్ నాయక్ తెలిపారు. ఈ విషయంలో సైన్యం తీసుకునే ప్రతి కార్యక్రమానికి అండగా నిలవాల్సిన బాధ్యత అందరి పై ఉందన్నారు. అదే సమయంలో తమ పార్టీ రాజకీయాలకు అతీతంగా ఉగ్రవాద నిర్మూలన కోసం చేసే ఎలాంటి ప్రయత్నానికైన సంపూర్ణంగా మద్దతునిస్తుందన్నారు.

రాజీ పడాల్సిన అవసరం లేదు : రూరల్ ఎమ్మెల్యే దద్దల బసనగౌడ



అదే విధంగా సైనిక చర్యను సమర్థించడం ప్రతియొక్కరు బాధ్యతగా గుర్తించాలని రూరల్ ఎమ్మెల్యే దద్దల బసనగౌడ అన్నారు. దేశ భద్రతకు సంబంధించి ఏ ఒక్క పౌరుడు రాజీ పడవల్సిన అవసరం లేదన్నారు. యుద్ధం పౌరుల పై కాదని ఉగ్రవాదం పై మాత్రమేననా బసనగౌడ వ్యాఖ్యానించారు. సైన్యం తీసుకుంటున్న చర్యలకు దేశంలోని ప్రతి పౌరుడు అండగా నిలవాలన్నారు.

నాణ్యమైన విత్తనాలు అందించాలి: రైతు సంఘం



కలెక్టరేట్ సిబ్బందికి వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

బళ్లారి సిటీ, మే 7(ఆంధ్రజ్యోతి): వర్షాకాలం సాగు రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందేలా చూడాలని కన్నడ నాడు రాష్ట్ర అధ్యక్షుడు మెణసిన ఈశ్వరప్ప కోరారు. బుధవారం నగరంలోని జిల్లా కలెక్టర్ ఆవరణలో రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. అనంతరం వారు జిల్లా కలెక్టర్ సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు నాణ్యమై విత్తనాలు, ఎరువులు తదితర అందించాలన్నారు. నాసిరకం విత్తనాలతో తీవ్రంగా నష్టపోయిన రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. నాణ్యమైన విత్తనాలు, అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. బ్లాక్ మార్కెట్‌పై కఠినచర్యలు తీసుకోవాలన్నారు. ఈసందర్భంగా కన్నడనాడు రైతు సంఘం కార్యదర్శి రుద్రగౌడ, మంజునాథ్, సంగప్ప, శివమూర్తి, గోవిందప్ప, శ్రీనివాసరెడ్డి,నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ప్లాంట్ ఏర్పాటుకు భూమిపూజ



భూమిపూజలో పాల్గొన్న ఎమ్మెల్సీ సతీష్, మేయర్ ముల్లంగి నందీష్

బళ్లారి సిటీ, మే 7(ఆంధ్రజ్యోతి): నగరంలోని 25వ వార్డు రేడియో పార్క్ ప్రాంతంలోని కేఈబీ సర్కిల్లో తాగునీటి ప్లాంట్ ఏర్పాటుకు ఎమ్మెల్సీ ఎం.సతీష్, మేయర్ ముల్లంగి నందీశ్ భూమిపూజ చేశారు. బుధవారం చేపట్టిన ఈ కార్యక్రమంలో రూ.9లక్షల విలువైన స్వచ్ఛమైన తాగునీటి యూనిట్ ఏర్పాటుకు మున్సిపల్ కార్పోరేషన్ సభ్యుడు ఎం.గోవిందరాజులు సమక్షంలో భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సతీష్ మాట్లాడుతూ, తాగునీటితో పలు రకాల వ్యాధులు ప్రబలుతున్నాయని ఆహారం శుభ్రంగా ఉంటే ఎలాంటి ఆరోగ్య సమస్య ఉండదన్నారు. ఈ ప్రాంతంలో పరిశుభ్రమైన నీరు అందించడానికి రూ.9లక్షలు ఎంపీ నిధులు అందిస్తున్నట్లు తెలిపారు. మేయర్ ముల్లంగి నందీశ్ మాట్లాడుతూ ప్రభుత్వ నిధులను వివిధ ప్రయోజనాల కోసం ఉపయోగిస్తారనీ, వాటిని ఇలా ప్రాథమిక మౌలిక సదుపాయాలను కల్పించడానికి ఉపయెగిస్తే ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో ఉప మేయర్ సుకుమ్, 25వ వార్డు మున్సిపల్ కౌన్సిల్ సభ్యుడు గోవిందరాజులు, మున్సిపల్ కౌన్సిల్ సభ్యుడు అర్షద్ అలీ, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు ఉచిత కంటి ఆపరేషన్లు

కంప్లి, మే 7(ఆంధ్రజ్యోతి): కూడ్లిగి పట్టణంలో వృద్ధులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. పేద ప్రజలను దృష్టిలో ఉంచుకుని కూడ్లిగి ఎమ్మెల్యే డాక్టర్ శ్రీనివాస్ ఉచిత కంటి చికిత్స శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో హోస్పేట అశ్విని హాస్పిటల్ వైద్యులు వందల మందికి ఆపరేషన్లు నిర్వహించారు.

తరగతి గదుల నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే బీఎం నాగరాజ

సిరుగుప్ప, మే 7(ఆంధ్రజ్యోతి): హాళేకోట ప్రభుత్వ పాఠశాలలో రూ. 30 లక్షల వ్యయంతో అదనపు గదులు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే బీఎం నాగరాజ భూమిపూజ చేశారు. బుధవారం పలు పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యతగా పనులు చేపట్టాలని కాంట్రాక్టర్లకు సూచించారు. పంచాయతీరాజ్ అభివృద్ధి నిధుల కింద ఈ పనులు జరుగుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ అధ్యక్షులు సురేష, సభ్యులు, నగరసభ కౌన్సిలర్ గణేష్ పాల్గొన్నారు.

వైభవంగా దొడ్డ ఆంజనేయస్వామి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

కంప్లి, మే 7(ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిధిలోని కుడితిని పట్టణంలో బుధవారం దొడ్డ ఆంజనేయస్వామి రథోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. గంగపూజ, అమృతాభిషేకం, పుష్పాభిషేకం, మహామంగళహారతి తదితర పూజలు నిర్వహించారు. పట్టణంలో స్వామివారిని పల్లకిలో ఊరేగింపు నిర్వహించారు. ప్రతి యేటా రథోత్సవంను కన్నుల పండువగా నిర్వహించుకుంటామని ఆలయ కమిటీ పదాధికారులు తెలిపారు. సాయంత్రం ఆలయం మొదలుకొని ఎదురు బసవన్న కట్ట వరకు రథోత్సవాన్ని ఊరేగించారు. ఎలాంటి సంఘటనలు జరుగకుండా కుడితిని పోలీసులు భారీ బందోబస్తు చేపట్టారు. రథోత్సవ కార్యక్రమం చుట్టుపక్కల గ్రామాల్లో పట్టణాలు భక్తాదులు పాల్గొని రథోత్సవానికి పూలు, పండ్లు విసురుతూ మొక్కలను సమర్పించుకున్నారు.

భక్తులకు మజ్జిగ పంపిణీ

కుడితిని పట్టణంలో సీతారామలక్ష్మణ ఆంజనేయ రథోత్సవం సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తులకు మజ్జిగ అన్నదానం చేపట్టారు. కనకదాస యువక మండలి ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. అలాగే వీధి వ్యాపారస్తులు భక్తులకు అన్నదానం చేపట్టారు. ప్రత్యేక పొరుగు గ్రామాల నుండి పట్టణాల నుండి ఆలయాన్ని దర్శించు కోవడానికి వచ్చిన భక్తులకు అన్నదానాలు మజ్జిగ, పాలు తమ వంతుగా ఇతర పంపిణీ చేస్తామని తెలిపారు.



మజ్జిగ పంపిణీ చేస్తున్న కనకదాస యువజన సంఘం సభ్యులు

కాంగ్రెస్ ప్రతిఘటన మహాసభ రద్దు

● ఆపరేషన్ సింధూర్‌తో చివరి క్షణంలో నిర్ణయం

రాయచూరు, మే 7(ఆంధ్రజ్యోతి): కేంద్రం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేఖ విధానాలను నిరశిస్తు ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని మహాత్మగాంధి స్టేడియంలో బుధవారం నిర్వహించతలపెట్టిన కాంగ్రెస్ ప్రతిఘటన మహాసభను రద్దు చేశారు. ఈ సమావేశానికి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గె, ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌లతో పాటు పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు ఇతర ప్రజాప్రతినిధులు హాజరైయ్యేందుకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు జరిగాయి. పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో ఉగ్రవాద శిబిరాల పై సింధూర్ పేరుతో జరిపిన దాడుల నేపథ్యంలో చివరి నిమిషంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేఖంగా ఏర్పాటు చేసిన సభ కావడంతో ఇదే సమయంలో కేంద్రంపై విమర్శలు చేయడం దేశ భద్రత, ఐక్యత, సమగ్రతల దృష్ట్యా సరైంది కాకపోవడంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు జిల్లా ఇంచార్జ్ మంత్రి డాక్టర్ వరణ ప్రకాశ్ పాటీల్ తెలిపారు.



కాంగ్రెస్ ప్రతిఘటన మహాసభ వేదికపై కార్యకర్తల కోలాహలం



బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు, అధికారులు

రేషన్ బియ్యం స్వాధీనం

బళ్లారి సిటీ, మే 7(ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా కమలాపూరంలో పేదల బియ్యం అక్రమంగా సేకరించి తరలిస్తుండగా బుధవారం పోలీసులు దాడి చేసి స్వాధీనం చేసుకున్నారు. రూ.1.92లక్షల విలువైన 7,410 కిలోల బియ్యాన్ని స్వాదీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబందించి కొప్పళ జిల్లా కుష్టగి తాలూకాలోని బన్నిహట్టి గ్రామానికి చెందిన బసవరాజ్, డ్రైవర్‌ను అరెస్టు చేశారు. హొసపేటకు చెందిన బాషాతో పాటు మరికొందరు కూడాఈ అక్రమ కార్యకలాపాలకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. రూ.5లక్షల విలువైన టాటా గూడ్స్ వాహనాన్ని కూడా స్వాదీనం చేసుకున్నారు. కమలాపురంలోని కుప్పయ్య క్యాంప్ కెనాల్ సమీపంలోని ఒక షెడ్‌పై ఆహార శాఖ అధికారులతో కూడి దాడి చేసినపుడు టాటా గూడ్స్ వాహనంలో అక్రమంగా నిల్వ చేసిన బియ్యాన్ని రవాణా చేయడానికి ప్రయత్నిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కమలాపురం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. హంపి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాజేశ్, కమలాపురం స్టేషన్ సంతోష్ దర్యాప్తు ప్రారంభించారు. దాడుల్లో పోలీసు సిబ్బంది మహంతేశ్ గురుబసవరాజు, వివేకానంద తదితరులున్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం



జ్యోతి వెలిగించి పోటీలను ప్రారంభిస్తున్న నాయకులు రామకృష్ణ

తోరణగల్లు, మే 7 (ఆంధ్ర జ్యోతి): సండూరు తాలుకా తోరణగల్లు ఆర్ఎస్‌లోని బ్లూస్టార్ స్పోర్ట్స్ క్లబ్ ప్రముఖులు దివంగత లాల్‌స్వామి స్మరణార్థం నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఆర్ఎస్‌లోని శ్రీ బసవేశ్వర గ్రామాంతర పాఠశాల ఆట మైదానంలో ప్రారంభించారు. పోటీల్లో ఆరు టీమ్‌లు పాల్గొంటాయని నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీలను ఈ నెల 18వ తేదీ వరకు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా పట్టణ ప్రముఖులు రామాంజిని, రామకృష్ణ మాట్లాడుతూ లాల్‌స్వామి స్పోర్ట్స్ క్లబ్‌కు ఎన్నో సేవలు అందించారన్నారు. ఆటలు ఒత్తిడిని తగ్గిస్తాయని వివాదాల్లో లేకుండా కలిసికట్టుగా క్రికెట్ ఆడాలని గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు. ఈ సందర్భంగా పట్టణ ప్రముఖులు పులికొండ బండెప్ప, శివప్ప, సత్య స్పోర్ట్స్ క్లబ్ ప్రముఖులు పదాధికారులు క్రికెట్ ఆటగాళ్లు పట్టిన ప్రముఖులు మెదలగువారు పాల్గొన్నారు.

పూడికతీత పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఉపాధి అధికారులు

గంగావతి రూరల్,మే 7(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని బసవపట్టణ గ్రామ పంచాయితీ పరిధిలోని నరేగా(మహాత్మగాంధీ జాతీయ ఉపాదిపథకం) కార్మికులు చేపడుతున్న విఠలాపూర్ సరస్సు పూడికతతీత పనులను పంచాయతీ అసిస్టెంట్ డైరెక్టర్ మహంతగౌడ పాటిల్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు కొలత ప్రకారం పనిచేయాన్నారు. పంచాయతీ సిబ్బంది పారదర్శకంగా రోజుకు రెండుసార్లు ఎన్ఎంఎంఎస్ హాజరును పోస్ట్ చేయాలన్నారు. సరస్సులో తవ్వకం పనులు చేపట్టడం వల్ల భూగర్భ జలాలు పెరుగుతాయని, దీని వల్ల బోరుబావులు కూడా రీఛార్జ్ అవుతా యన్నారు. సంవత్సరానికి 100పని దినాలు పని చేయించుకరునే అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఈసందర్భంగా బసాపట్టణ పీడీఓ విద్యావతి, తాలూకా ఐఈసీ కోఆర్డినేటర్ బాలప్ప తలకేరి , టెక్నికల్ కో ఆర్డినేటర్ బసవరాజ్ జటగి, టెక్నికల్ అసిస్టెంట్ లీలావతి, గ్రామపంచాయితీ సిబ్బంది బెట్టప్ప, బీఎఫ్‌టీ హనుమేశ్ ఇతర సభ్యులు పాల్గొన్నారు.

సంగీతంతో పిల్లల్లో సృజనాత్మకత



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సిద్ధరామేశ్వరగౌడ

బళ్లారి సిటీ,మే 7(ఆంధ్రజ్యోతి): పాఠ్యేతర కార్యకలాపమైన సంగీతంతో పిల్లలు సృజనాత్మకంగా ఎదగడానికి దోహదపడుతుందని లయన్స్ క్లబ్ బళ్లారి అధ్యక్షుడు సిద్ధరామేశ్వర గౌడ అన్నారు. బళ్లారిలోని శ్రీ గురు పుట్టరాజ సంగీత పాఠశాల వారు హార్మోనియం సహాయంతో నిర్వహించిన నెలరోజుల వేసవి శిబిరం ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. బళ్లారి జిల్లా కళాకారుల సంఘం అధ్యక్షుడు యల్లనగౌడ శంకర బండ మాట్లాడుతూ 20సంవత్సరాల క్రితం ప్రభుత్వ సంస్థల సహకారంతో ఇలాంటి సంగీత వేసవి శిబిరాలను నిర్వహించేవారని, ఇప్పుడు గురుపుట్టరాజ సంగీత పాఠశాల ఇలాంటి వేసవి శిబిరాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈసందర్భంగా సంగీత ఉపాధ్యాయుడు దొడ్డా బసవ గవాయి, తిమ్మారెడ్డి, ప్రిన్సిపల్ ఆంజనేయ, మల్లికార్జున, కాశీం అలీ, మోగీస్, సంగీత పాఠశాల అధ్యక్షురాలు కవిత, బసవరాజ్ విజయ్ కుమార్, ఎరేగౌడ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా బస్సు ప్రయాణం

తోరణగల్లు, మే 7 (ఆంధ్ర జ్యోతి) : సరైన బస్సు సౌకర్యాలు లేక కార్మికులు విలవిలలాడుతున్నారు. రాత్రివేళ కర్మాగారాల నుంచి ఇళ్లకు వెళ్లే వేళ బస్సులు తక్కువగా ఉండడంతో ఇబ్బందులు పడుతున్నారు. పుట్‌బోర్డుతో ప్రయాణంతో ఇబ్బంది పడుతున్నారు. ఇది ప్రమాదమని తెలిసి కూడా తప్పని పరిస్థితుల్లో ప్రయాణించాల్సి వస్తోందని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు బస్సులను పెంచి ప్రయాణికులకు సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.



పుట్‌బోర్డుపై ప్రయాణిస్తున్న దృశ్యం

హోసూరు జోన్

ఒక్క రోజులోనే సొంత పార్టీలో చేరిక..



ఎమ్మెల్యే ప్రకాశ్ సమక్షంలో చేరిన కార్యకర్తలు

హోసూరు, మే 7 (ఆంధ్రజ్యోతి): 2026 శాసనసభ ఎన్నికలకు ఇప్పటినుంచే రాజకీయాలు కొనసాగుతున్నాయి. ప్రధాన పార్టీలు డీఎంకే, అన్నాడీఎంకేల మధ్య పోటీ ఉంది. వేపనపల్లి నియోజకవర్గంలో కొంతమంది అన్నాడీఎంకేలో చేరారు. మరుసటి రోజు తిరిగి డీఎంకేలోకి వచ్చారు. డీఎంకే జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్యే ప్రకాశ్ సమక్షంలో చేరగా వారిని కండువాలతో స్వాగతించారు. హోసూరు మునిసిపల్ సౌత్‌ఏరియా కార్యదర్శి తిమ్మరాజ్ నేతృత్వంలో కొంత మంది మంగళవారం అన్నాడీఎంకేలో ఎడప్పాడి పళనిస్వామి సమక్షంలో చేరారు. తిరిగి బుధవారం వారంతా డీఎంకేలో చేరారు. ఈ విషయం స్థానికంగా చర్చనీయాంశమైంది.

గోవింద బస్టాండ్‌లో చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మాజీ మంత్రి బాలకృష్ణారెడ్డి

హోసూరు, మే 7(ఆంధ్రజ్యోతి): మండుతున్న ఎండలనుంచి ఉపశమనం పొందేలా వివిధ పార్టీల వారు చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా గోవింద అగ్రహార బస్టాండ్ సమీపాన అన్నాడీఎంకే ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని లాంఛనంగా ప్రారంభించారు. పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి సూచనల మేరకు చలివేంద్రం ఏర్పాటు చేసినట్టు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో కృష్ణగిరి పశ్చిమ జిల్లా కార్యదర్శి, మాజీ మంత్రి బాలకృష్ణారెడ్డి పాల్గొని ప్రజలకు మజ్జిగ, దోసకాయ, గుమ్మడికాయ, ద్రాక్ష, నిమ్మరసం, శీతల పానీయాలు, స్వీట్లు అందచేశారు. విద్యార్థి విభాగం కృష్ణగిరి జిల్లా సంయుక్త కార్యదర్శి అరుణ్‌కుమార్, మాజీ కౌన్సిలర్ మురళి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ మహిళల కోసం తొలి నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రం

హోసూరు, మే 7(ఆంధ్రజ్యోతి): తమిళనాడు లీగల్ డిఫెన్స్ అసోసియేషన్ ఫర్ ది డిజేబుల్డ్ ఆధ్వర్యంలో కృష్ణగిరి జిల్లా హోసూరులో దివ్యాంగ మహిళలకోసం నైపుణ్యాభివృద్ధి శిక్షణా కేంద్రం ఏర్పాటైంది. తిన్నూర్‌లోని లక్ష్మీనరసింహన్‌నగర్‌లో నైపుణ్యాభివృద్ధి శిక్షణాకేంద్రాన్ని జిల్లా దివ్యాంగుల సంక్షేమ అధికారి మురుగేశన్, హోసూరు ఏఎస్పీ అక్షయ్ అనిల్ లాంఛనంగా ప్రారంభించారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, న్యాయవాది షణ్ముగసుందరం మాట్లాడుతూ తమిళనాడు ప్రభుత్వం దివ్యాంగులకు కుట్టుయంత్రాలను ఇస్తోందన్నారు. దివ్యాంగులకు సహకారం అందించేలా నైపుణ్యాభివృద్ధి శిక్షణా కేంద్రాన్ని ప్రారంభించినట్టు తెలిపారు. ఇక్కడ కుట్టుపని, ఎంబ్రాయిడరీ వంటివి నేర్పిస్తారన్నారు. టైలరింగ్ ద్వారా దివ్యాంగమహిళలకు ఉపాధి లభిస్తుందన్నారు. తొలిదశలో బ్యాచ్‌కు ఐదుగురు చొప్పున సంవత్సరానికి 500మందికి శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు.



నైపుణ్యాభివృద్ధి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏఎస్పీ అక్షయ్ అనిల్